ప్రజాశక్తి
www.prajasakti.com
I

ఎలక్షన్ హడావుడి షురూ...

- దృష్టి సారించిన రాష్ట్రంలోని అన్ని పార్టీలు
- ఇప్పటికే తెలంగాణాలో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- సిఎం కప్, ఆత్మీయ సమ్మేళనాలతో జనంలోకి గులాబీ పార్టీ
- కర్ణాటక జోష్‌తో 'హస్తం'
- చేరికలపై ఫోకస్
- మత పరమైన వేడుకలు, యాత్రల్లో కమలం నేతలు బిజీ
- ప్రజా సమస్యలే అజెండాగా వామపక్షాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర శాసనసభ ఎన్నికల వేడి క్రమక్రమంగా రాజుకుంటోంది. అన్ని పార్టీలు ఎలక్షన్లపై దృష్టి సారించాయి. క్షేత్రస్థాయిలో అందుకనుగుణంగా సన్నాహాలు మొదలుపెట్టాయి. జనంతో మమేకమయ్యేందుకు, తద్వారా ఓటరన్నకు చేరువయ్యేందుకు రకరకాల రూపాల్లో ఇప్పటికే తమ ప్రయత్నాలను ప్రారంభించాయి. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఆరేడు నెలల సమయముంది. కానీ ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పని మొదలుపెడితే ఫలితం ఉండబోదని భావించిన పార్టీలు, నేతలు గత రెండు మూడు నెలల నుంచే 'గ్రౌండ్ ప్రిపరేషన్'లో తలమునకలయ్యారు. మరోవైపు ప్రజల్లో సైతం ఎలక్షన్ల గురించి చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి.

ఎన్నికల సన్నద్ధతలో మిగతా పార్టీలతో పోలిస్తే అధికార 'గులాబీ దళమే' ముందంజలో ఉంది. పార్టీ అధ్యక్షుడు, సిఎం కెసిఆర్ పిలుపు మేరకు ఫిబ్రవరి నుంచే 'ఆత్మీయ సమ్మేళనాల' పేరిట ఆ పార్టీ పని ప్రారంభించింది. గ్రామాలు, మండల కేంద్రాల్లో పార్టీ కార్యకర్తలు, నేతలు, సానుభూతిపరులతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వన భోజనాలు, విందులు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త కలెక్టరేట్లు, జిల్లాల్లో బిఆర్ఎస్ కార్యాలయాల ప్రారంభోత్సవాల పేరిట ఫిబ్రవరి, మార్చి నెలల్లో సుడిగాలి పర్యటనలు చేసిన కెసిఆర్.. ఆయా వేదికల ద్వారా కేంద్రంలోని బిజెపిపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆ తర్వాత 125 అడుగుల బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ, నూతన సచివాలయం ప్రారంభోత్సవాల పేరిట ఆయన దేశ రాజకీయాల్లో నానేందుకు ప్రయత్నించారు. ఆయా సందర్భాల్లో నిర్వహించిన సభలన్నీ ఎన్నికల సన్నద్ధతల్లో భాగంగానే కొనసాగాయి. మరోవైపు ఆంధ్రా, మహారాష్ట్ర నుంచి చేరికలంటూ ఆ పార్టీ ఇప్పటికే రోజుకో మీటింగ్ నిర్వహిస్తూ 'ఎలక్షన్ ఫీవర్'ను కొనసాగిస్తూ ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని యువతను ఆకర్షించటమే లక్ష్యంగా 'సిఎం కప్' పేరిట గ్రామ,మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటల పోటీలు నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. పైకి చూడటానికి ఇది ప్రభుత్వ కార్యక్రమంగా ఉన్నప్పటికీ... అంతర్గతంగా రాజకీయ పరంగా 'ఎన్నికల కోణమే' కనిపిస్తోంది. ఇక రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్... కర్నాటక అసెంబ్లీ ఫలితాలతో మాంచి జోష్‌లో ఉంది. అక్కడి ఫలితాలు ఇక్కడ కూడా ప్రభావం చూపుతాయంటూ చెబుతున్న ఆ పార్టీ నేతలు... అందుకనుగుణంగా తెలంగాణలో 'హస్తాన్ని' బలోపేతం చేస్తామంటూ చెప్పుకొస్తున్నారు. అందులో భాగంగా వివిధ జిల్లాల్లో పదవులు లేక అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ నేతలు, అసమ్మతివాదులు, బహిష్కరణకు గురైన వారిపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇటీవల వార్తల్లో ఎక్కువగా నానుతున్న ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటిని తమ వైపు



లాక్కునేందుకు పీసీసీ చీఫ్ రేవంత్ చేసిన ప్రయత్నాలు ఫలించినట్టు తెలిసింది. ఆయన జూన్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్టు వినికిడి. పొంగులేటి హస్తం పార్టీలో చేరితే ఆయన వెంటే... ఉమ్మడి పాలమూరు సీనియర్ నేత జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్‌లో చేరతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఏప్రిల్‌లో రేవంత్ నిర్వహించిన 'హాత్ సే హాత్ జోడో...' యాత్ర, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క 'లాంగ్ మార్చ్' పేరిట కొనసాగిస్తున్న పాదయాత్ర కూడా రానున్న ఎన్నికల సన్నద్ధతలో భాగమే.

ఇక రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయినా ఈసారి ఎక్కువ సీట్లు గెలిచేందుకు తహతహలాడుతున్న కమలం పార్టీ... అందులో భాగంగా మత సంబంధిత యాత్రలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో పలు దఫాలుగా ప్రజా సంగ్రామ యాత్రలను నిర్వహించారు. మరో దఫా కూడా ఆ యాత్రను చేపట్టేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. తాజాగా ఆదివారం కరీంనగర్‌లో 'హిందూ ఏక్తా యాత్ర'కు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను ఆహ్వానించి హడావుడి చేశారు. వచ్చే ఎన్నికల దాకా ఇదే రకంగా పలు రకాల యాత్రలను నిర్వహించాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనబడుతోంది. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలతోపాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షుడిగా ఉన్న బిఎస్‌పి, వైఎస్ షర్మిల నేతృత్వంలోని వైఎస్ఆర్ టిపి, విశారదన్ మహరాజ్ ప్రకటించిన ధర్మ సమజ్ పార్టీ తమ తమ స్థాయిల్లో యాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.

పోరాటాలతో వామపక్షాలు...

ఇక రాష్ట్రంలో వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలతో ముందుకెళుతున్నాయి. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పోడు భూముల సమస్యలపై సిపిఎం ఇటీవల అనేక పోరాటాలు నిర్వహించింది. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు విడమరిచి చెప్పేందుకు వీలుగా ఆ పార్టీ మార్చిలో 'జన చైతన్య యాత్ర'ను నిర్వహించింది. ఇదే తరహాలో 'బిజెపి హఠావో-దేశ్ కీ బచావ్' నినాదంతో సిపిఐ ఇంటింటికీ ప్రచారాన్ని ప్రారంభించింది.

పని ప్రారంభించిన ఇసి...

పార్టీలు, ప్రజల పరిస్థితి ఎలా ఉన్నా... ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) అధికారులు... హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి అధికారులతో భేటీ అయ్యారు. ఇవిఎంలు, స్ట్రాంగ్ రూములు, ఎలక్షన్ బూత్‌లు, ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు తదితరాంశాలపై వారు ప్రాథమికంగా చర్చించారు. ఈ రకంగా రాష్ట్రంలో ఇప్పుడు ప్రారంభమైన ఎన్నికల జాతర... డిసెంబరు వరకూ కొనసాగనుంది.

బతుకుదెరువు కోసం వచ్చి...

- డిసిఎంను ఢీ కొన్న సిమెంట్ లారీ
- నలుగురు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉన్న ఊరిలో ఉపాధి లేక నగరానికి వలసొచ్చి జీవనం సాగిస్తున్న నలుగురు కూలీలు.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అర్ధరాత్రి మద్యం మత్తులో లారీ నడిపిన డ్రైవర్.. డిసిఎంను ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతిచెందిన వారిలో.. ఇద్దరు ఇబ్రహీంపట్నం చౌరస్తాలో సోమవారం రాత్రి జరిగిన హిందూవాహిని జగరణకు వచ్చిన కూలీలున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జియాగూడకు చెందిన ఐనాల మహేష్ అలియాస్ బల్లు(21), పంపనోల్ల మహేష్ (55)తో పాటు మరి కొంతమంది డిజె సౌండ్స్‌లో పని చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం రాత్రి జరిగిన హిందూ వాహిని వేడుకకు వీరు వెళ్లారు. రాత్రి పనులు ముగించుకొని అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. తుర్కయంజాల్ సమీపంలో తులిప్స్ గ్రాండ్ హోటల్ వద్దకు రాగానే ఎల్‌బినగర్ వెళ్లాలని డిజె బాక్స్‌లతో వెళ్తున్న డిసిఎంను నిలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన యువకులు నాగ సాయిరెడ్డి, శివారెడ్డి లింగారెడ్డి డిసిఎం ఎక్కుతుండగా మాచర్ల నుంచి ఇంజాపూర్ గోదాంకు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ అతివేగంగా వచ్చి డిసిఎంను ఢీకొట్టింది. డిసిఎంలో ఉన్న జియాగూడకు చెందిన ఐనాల మహేష్, మహేష్, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లయ్యపాలెంకు చెందిన నాగ సాయిరెడ్డి(22) అక్కడికక్కడే మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన తుమ్మోజా లక్ష్మయ్య (52) మంగళవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. డిసిఎం పక్కనే నిల్చున్న గుంటూరు జిల్లాకు చెందిన శిఖరెడ్డి, లింగారెడ్డి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరూ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. జియాగూడకు చెందిన అబిలాష్ చెవి తెగిపోయింది. సురేష్ కాలు విరిగింది. వీరంతా ప్రస్తుతం పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ మద్యం తాగి నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు గుర్తించారు. పోలీసులు లారీ డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా 181 ఎంజీ వచ్చినట్టు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రవీందర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసినట్టు సిఐ రవికుమార్ తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోస్టుమార్థం నిర్వహించి, నాలుగు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న రొంపేడు కొత్తగుంపు గ్రామస్తులు

మంచినీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం రొంపేడు కొత్త గుంపులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొమ్ముగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సర్పంచ్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్ణపాక రామయ్య మాట్లాడుతూ.. మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ మహిళలు మాట్లాడుతూ.. ఎర్రటి ఎండాకాలంలో మంచినీళ్ల సమస్య తీవ్రంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్పంచ్ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇరప బద్రమ్మ, ఏపే మల్లేశ్వరి, జోగా రాంబాబు, వాసం నాగమణి, సుంచు కుమారి, వాసం భద్రమ్మ పాల్గొన్నారు.

లావా నుంచి అగ్ని2 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ: దేశీయ మొబైల్ బ్రాండ్ కంపెనీ లావా మార్కెట్లోకి కొత్తగా 'అగ్ని 2' 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. కర్వ్ డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్ ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఇది మధ్య శ్రేణీ స్మార్ట్ ఫోన్ కొనుగోలుదారులకు ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. మీడియాటెక్స్ నూతన డైమెన్సిటీ 7050 ప్రాసెసర్, 50 ఎంపి క్వాడ్ కెమెరా, 8జిబి ర్యామ్, 256 స్టోరేజీతో అందిస్తోన్నట్లు పేర్కొంది. 4700 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన ఈ ఫోన్ కేవలం 16 నిమిషాల్లో 50 శాతం చార్జింగ్‌ను చేరుకుంటుందని తెలిపింది.

అమెజాన్‌లో ఉత్పత్తులు ప్రియం

- విక్రేతల ఫీజు పెంచిన సంస్థ

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు చౌక, తక్కువ ధరతో విక్రయించుకోవచ్చు అనుకునే వారికి అమెజాన్ షాక్ ఇచ్చింది. ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తమ వేదికపై ఉత్పత్తులను అమ్మే విక్రేతల నుంచి వసూలు చేసే ఫీజును పెంచాలని నిర్ణయించింది. అమెజాన్‌లో వస్తువుల అమ్మకానికి గాను ఆ సంస్థ విక్రేతల నుంచి ఛార్జీ వసూలు చేస్తుంది. దాదాపు అన్ని కేటగిరీల ఉత్పత్తులపై ఈ పెంపును చేపట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వస్త్రాలు, సౌందర్య ఉత్పత్తులు, కిరాణా, ఔషధాలు తదితర రకాల వస్తువులపై విధించే సెల్లర్ ఫీజును మే 31 నుంచి పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో అమ్మకందారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపనున్నారు. ఆయా కేటగిరీలను బట్టి ఈ ఛార్జీలు ఉంటాయని ఆ సంస్థ తెలిపింది. ప్రస్తుతం రూ.300లోపు ఉన్న హెయిర్‌కేర్, బాత్, సౌందర్య ఉత్పత్తులకు 7 శాతంగా ఉన్న ఫీజును 8.5 శాతానికి పెంచనుంది. రూ.1000 పైగా ఉన్న ఉన్న దుస్తులపై 19 శాతంగా ఉన్న ఫీజును 22.5 శాతానికి చేర్చింది. లాభదాయకతను పెంచుకునే పనిలో భాగంగా సెల్లర్స్ ఫీజును పెంచిందని స్పష్టమవుతోంది. ఫీజు పెంపునతో తమ అమ్మకాలపై ప్రభావం పడొచ్చని విక్రేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ పరిరక్షణ

- రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్
- మియాపూర్‌లో 'ఇ-గరుడ' పేరుతో ఎలక్ట్రిక్ ఆర్‌టిసి ఎసి బస్సులు ప్రారంభం
- హైదరాబాద్-విజయవాడ మధ్య ప్రతి 20 నిమిషాలకి ఒక బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్ క్రాస్ రోడ్స్ సమీపంలోని పుష్పక్ బస్ పాయింట్ వద్ద మంగళవారం 'ఇ-గరుడ' పేరుతో ఎలక్ట్రిక్ ఆర్‌టిసి ఎసి బస్సులను ఆర్‌టిసి చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడి, ఎండి విసి సజ్జనార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు, హైటెక్ హంగులతో అందుబాటులోకి తెస్తున్న ఇ కొత్త ఎలక్ట్రిక్ ఎసి బస్సులకు 'ఇ-గరుడ'గా సంస్థ నామకరణం చేసిందని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రతి 20 నిమిషాలకో ఎలక్ట్రిక్ ఎసి బస్సు నడిపేలా ప్రణాళిక రూపొందించామన్నారు. రాబోయే రెండేళ్లలో కొత్తగా 1860 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. వాటిలో 1300 బస్సులను హైదరాబాద్ సిటీలో, 550 బస్సులను సుదూర ప్రాంతాలకు నడుపుతామని తెలిపారు. హైదరాబాద్‌లో 10 డబుల్ డెక్కర్ బస్సులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. 12 మీటర్ల పొడవు గల ఈ ఎలక్ట్రిక్ ఎసి బస్సులు.. హైటెక్ హంగులతో ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. 41 సీట్ల సామర్థ్యం గల ఈ బస్సుల్లో ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతో పాటు రీడింగ్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, రీజనల్ మేనేజర్ శ్రీధర్, డిఆర్ఎం రాజు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అజాద్ ఇంజనీరింగ్‌లో సచిన్ పెట్టుబడులు

హైదరాబాద్ : అజాద్ ఇంజనీరింగ్ సంస్థలో ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ ఎరోస్పేస్, డిఫెన్స్, క్లీన్ ఎనర్జీ, ఇంధనాలు, సహజవాయువు తదితర రంగాల సంస్థలకు పలు రకాల ఇంజినీరింగ్ ఉత్పత్తులు, విడిభాగాలు తయారీ చేసి అందిస్తోంది. సచిన్ తమ వాటాదారుడు కావటం ఎంతో సంతోషమని ఆజాద్ ఇంజనీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ ఛోప్దార్ పేర్కొన్నారు. ఈ సంస్థలో సచిన్ ఎంత పెట్టుబడి పెట్టారు. ఎంత వాటాను ఆయనకు ఇచ్చారనే వివరాలను ఆ కంపెనీ వెల్లడించలేదు.

పండ్ల విభాగంలోకి అక్షయకల్ప ఆర్గానిక్ ప్రవేశం

హైదరాబాద్ : దేశంలోనే తొలిసారి గుర్తింపు పొందిన ఆర్గానిక్ పాల ఉత్పత్తుల కంపెనీ అయిన అక్షయకల్ప ఆర్గానిక్ కొత్తగా 'గ్రీన్స్' పేరుతో సేంద్రియా కూరగాయలు, పళ్ల కేటగిరీలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ సిఇఒ, వ్యవస్థాపకులు శశి కుమార్ మాట్లాడుతూ.. మొదటి దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలోని 50 పైగా పట్టణాలు, నగరాల్లో తమ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. దశలవారీగా పండ్లు, కూరగాయల డెలివరీని ప్రారంభించనున్నామన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాల్సిందే

- ప్రజా సంఘాల డిమాండ్
- 18న దేశ వ్యాపితంగా పోరాట దినాన్ని జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వి రమ, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు నిరసన తెలుపుతున్నారని, కేంద్ర ప్రభుత్వం కూడా భూషణ్‌పై చర్యలు తీసుకోకపోవడంతో మూడు మాసాల తరువాత ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. అంతర్జాతీయంగా పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చిపెడుతున్న ఒలింపిక్ పతక విజేతలతో సహా మన అగ్రశ్రేణి క్రీడాకారులు కూడా న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆవేదన

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వ్యక్తం చేశారు. మల్లయోధుల ఆరోపణలపై విచారణ జరిపిన పర్యవేక్షక కమిటీ ఫలితాలను బహిర్గతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌తో పాటు డబ్ల్యుఎఫ్ఐలో పనిచేస్తున్న మరికొందరు కోచ్‌లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ప్రముఖ మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, కేంద్ర ప్రభుత్వం ఒకవైపు 'బేటీ బచావో బేటీ పడావో' అంటూ సంబరాలు చేసుకుంటూనే, మరోవైపు ఈ దారుణమైన నేరంలో నిందితుడైన బిజెపి ఎంపిని రక్షించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దోషులను శిక్షించే వరకు తాము వెనక్కి తగ్గబోమని అగ్రశ్రేణి రెజ్లర్లు అంటున్నారని, నిందితులపై పోక్సో చట్టంతో పాటు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వేధింపులు ఆరోపణలపై న్యాయమైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ అథ్లెట్లు వారి కలలను సాకారం చేసుకోవడానికి ఇలాంటి ఘటనలు కారణం కాకూడదని నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రో నిర్మాణంలో మరో కీలక అడుగు

- గ్లోబల్ టెండర్లకు ఆహ్వానం
- నేటి నుంచి బిడ్డింగ్ పత్రాల జారీ
- ప్రాజెక్టుకు రూ.5,688 కోట్లు
- బిడ్డింగ్‌కు చివరి తేదీ జులై 5
- హెచ్ఎఎంఆర్ఎల్ ఎమ్‌డి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. 31 కి.మీ మీటర్ల పొడవైన ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు ఈపీసీ కాంట్రాక్టర్ ఎంపిక కోసం(ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణం) గ్లోబల్ టెండర్లను ఆహ్వానించినట్టు హెచ్ఎఎంఆర్ఎల్ ఎమ్‌డీ ఎన్‌విఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బిడ్డింగ్ పత్రాలను నేటి నుంచి జారీ చేయనున్నామని, చివరి తేదీ జులై 5గా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కాంట్రాక్టు విలువ రూ.5,688 కోట్లుగా నిర్ధారించారు. టెండర్ విలువ ప్రాజెక్టు వ్యయం కంటే తక్కువగా ఉండటంపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ ప్రాజెక్టు విలువ మొత్తం రూ.6,250 కోట్లు కాగా.. ఇందులో రూ.5,688 కోట్లు మెట్రో ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం వినియోగించగా.. మిగిలిన రూ.562 కోట్లు భూగర్భ సామర్థ్య పరీక్షలు, పెగ్ మార్కింగ్ తదితర పనుల కోసం ఖర్చు చేయనున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ఎంపికైన కాంట్రాక్టర్ మెట్రో రైలు వ్యవస్థకు అవసరమైన ఎలివేటెడ్ వయాడక్ట్, భూగర్భ పనులు, స్టేషన్లు, ట్రాక్ పనులు, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు, సరఫరా, రోలింగ్ స్టాక్(రైలు బోగీలు), ఎలక్ట్రిక్ ట్రాక్షన్, విద్యుత్ సరఫరా, సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్స్, రైలు నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్(ఏఎఫ్‌సీ) గేట్లు మొదలైనవి పూర్తిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న పనులు

ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, పెగ్ మార్కింగ్, అలైన్‌మెంట్ ఫిక్సేషన్ వంటి ప్రాథమిక పనులన్నీ పూర్తయ్యాయని, భూసామర్థ్య పరీక్షల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కోసం చేపట్టిన కొత్త సర్వే ప్రకారం రాయదుర్గం మెట్రో స్టేషన్-ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ స్టేషన్‌ల నడుమ మొత్తం దూరం 31 కి.మీలు కాగా.. ఇందులో ఆకాశమార్గం(పిల్లర్లపై ఎలివేటెడ్) 29.3 కి.మీ ఉండగా, అండర్ గ్రౌండ్‌లో 1.7కి.మీ పొడవున పనులు జరుగుతాయని చెప్పారు. కాగా, విమానాశ్రయ టెర్మినల్‌కు ఆనుకొని ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో కలిపి మొత్తం 9 స్టేషన్లు ఉంటాయని, విమానాశ్రయ మెట్రో కారిడార్‌కు సమీపంలో వాణిజ్య, బహుళంతస్తుల భవనాల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతుందని వివరించారు.

మరో నాలుగు అదనపు స్టేషన్లు..

అన్ని తరగతుల వారు ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్ ద్వారా నగరంలో వారివారి కార్యాలయాలను చేరుకొనేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అవసరమైతే భవిష్యత్తులో మరో నాలుగు అదనపు స్టేషన్ల నిర్మాణానికీ తగిన ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. టెండర్ పత్రాలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వ ఇ-పోర్టల్ లో అప్‌లోడ్ చేస్తారు. ఇక ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన ఈపీసీ టెండర్ డాక్యుమెంట్లను తయారు చేసేందుకు జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సిస్ట్రా, రైట్స్ డీబీ ఇంజినీరింగ్ సంస్థల కన్సార్టియంను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంలో పలు విభాగాల్లో నిష్ణాతులైన 18మంది ఇంజినీరింగ్ నిపుణులు, క్షేత్రస్థాయిలో మరో 70మంది సీనియర్ ఇంజినీర్లు తదితర సిబ్బందిని కన్సార్టియం సమకూర్చుతుందని, ఈ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ వెంటనే తన పనిని ప్రారంభిస్తుందని ఎన్వీఎస్ రెడ్డి గతంలో ప్రకటించారు.

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE
SENIOR CIVIL UDGE::NARASARAOPET
H.M.O.P No.44/2022

Between :
Mallampati Palanki Reddy, S/o.Chinnapu Reddy, H.No:5-21, V.Appapuram, Guntur Dist-522660 ....Petitioner
And
Marella Sirisha. .....Respondent
To,
Marell Sirisha, W/o.Mallampati Palanki Reddy, D/o.Yedukondalu, R/o.Flat No:195, Mithani Colony, Hayath Nagar, Hyderabad, Telangana State.

పై నెంబరు H.M.O.P పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:14-06-2023కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30ని.ల.కు మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:14-06-2023

B.KRISHNA KISHORE,
Advocate for Petitioner,
Flat No:201,Gokul Apartments,
4 th Lane, A.T.Agraharam,
Guntur-522 004, Cell: 98485 60714

నకిలీ విత్తనాల బెడద నివారించాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలో విత్తనాల తయారీలో ప్రయివేటు కంపెనీలదే పైచేయిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. వాటిని నియంత్రించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. నకిలీ విత్తనాల బెడద సంపూర్ణంగా నివారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పని చేయాలని కోరారు. నకిలీ విత్తనాలను అరికట్టే ప్రయత్నంలో అమాయకులను బలిచేయవద్దనీ, ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. కర్ణాటక, కర్నూలు, గద్వాల, గుంటూరు, ప్రకాశం, అసిఫాబాద్, బెల్లంపల్లి, గుజరాత్, జహీరాబాద్ మీదుగా వచ్చే దారులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందన్నారు. హెచ్‌టీ పత్తి విత్తనాల విషయంలో రైతులను చైతన్యం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో కనిపించే చిన్న, చిన్న లోపాలు, తప్పిదాలపై కఠినంగా వ్యవహరించకుండా వ్యాపారులు, విత్తన వ్యాపారులకు సమయం ఇచ్చి సరి చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దేశంలో అవసరమైన 60 శాతం విత్తనాలను తెలంగాణ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అందిస్తున్నదనీ, ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని కోరారు. వ్యవసాయం బాగుండాలంటే రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలానికి పత్తి, మిరప, కందులు, వరితోపాటు మిగిలిన అన్ని రకాలు కలిపి 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా ఉందన్నారు.

సామర్థ్యాన్ని పెంచేందుకు శిక్షణ

- ఆస్కీ, టీ హబ్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ రంగాల్లో పని చేస్తున్న వారి సామర్థ్యాన్ని పెంచేందుకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి), టీ-హబ్ ఒప్పందంపై సంకతం చేశాయి. మంగళావారం హైదరాబాద్‌లోని అస్కీలో నిర్వహించిన కార్యక్రమంలో ఇరు సంస్థలకు చెందిన అధికారులు ఉన్నారు.

ఏకో సిస్టమ్‌లో సహకారాన్ని ప్రోత్సహించేందుకు, సాంకేతిక టెక్నాలజీ ఆధారిత స్టార్టప్ కంపెనీలకు మద్దతు తెలిపేందుకు, సమగ్ర పర్యావరణ వ్యవస్థను రూపొందించడం తదితర అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నిర్మల్య బాగ్చి, టీహబ్ సీఈవో ఎం శ్రీనివాస్‌రావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఇరు సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ఈషా ఐవిఎఫ్ ఫెర్టిలిటీ ప్రచారకర్తగా నటి భూమికా చావ్లా

హైదరాబాద్ : సంతానసాఫల్య కేంద్రం ఈషా ఐవిఎఫ్ పెర్టిలిటీ సెంటర్ తన ప్రచారకర్తగా బాలీవుడ్ నటి భూమికా చావ్లాను నియమించుకున్నట్లు ప్రకటించింది. బంజారా హిల్స్‌లోని ఈషా ఐవిఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్, సీనియర్ ఐవిఎఫ్ స్పెషలిస్ట్, వ్యవస్థాపకురాలు అయిన డాక్టర్ చందన లక్కిరెడ్డి ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తమ బ్రాండ్ అంబాసీడర్‌గా చావ్లా ఉంటారని తెలిపారు. ఈషా ఐవిఎఫ్ గచ్చిబౌలిలో తన రెండవ బ్రాంచ్ ఏర్పాటు చేయడం తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామన్నారు.

పల్లె రవికి జర్నలిస్టుల అభినందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గీతకార్మిక సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియామకమైన సీనియర్ జర్నలిస్టు పల్లె రవికుమార్ గౌడ్‌ను పలువురు సీనియర్ జర్నలిస్టులు అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్‌లో ఉన్న సంక్షేమభవన్ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అలాగే సమకాలీన అంశాలపై చర్చ కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ పదవిలో ఉన్న నేపథ్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బి.బసవపున్నయ్య, గుడిగ రఘు, బి.రాజశేఖర్, దామోదర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ రిజిస్ట్రేషన్లు షురూ

మొదటి రోజు 4,722 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిఎస్‌డబ్ల్యు, బిసిఎ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రోజు దోస్త్‌కు 4,722 దరఖాస్తులొచ్చాయని వివరించారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. వచ్చేనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ ఏడాది విద్యార్థుల కోసం ప్రత్యేకంగా దోస్త్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని కోరారు.

'ఉపాధి' రక్షణకు ఉద్యమిద్దాం

- పట్టణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఉద్యమించాలని, పట్టణ పేదలకు ఉపాధి పనులు వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్ట రక్షణ అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ బాలమల్లేష్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. పని అమలౌతున్న గ్రామాలను కొత్తగా నగర పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కలిపి పట్టణం పేరుతో పనులు కల్పించడం లేదని చెప్పారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం మాదిరి పట్టణ పేదలకు కూడా ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం జరుగుతున్న దశలవారీ ఆందోళనలు, పోరాటాలలో కూలీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ.. దేశంలో ఈ చట్టం కింద పని కోసం జాబ్ కార్డులు పొందిన కూలీల్లో సగం మందికి కూడా పని చూపడం లేదని చెప్పారు. రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో 57.17 లక్షల జాబ్ కార్డులలో కోటి 20 లక్షల మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. కానీ రాష్ట్రంలో 36.73 లక్షల జాబ్ కార్డులలోని 65 లక్షల మంది కూలీలకు మాత్రమే పని కల్పించినట్టుగా గత సంవత్సర ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయన్నారు.

జాబ్ కార్డులలో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని చట్టంలో ఉన్న డైరెక్షన్‌ను అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2.64 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కూలీల జాబు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్లను లింక్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలిచ్చిందన్నారు. పని ప్రదేశంలో ఉదయం ఏడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు మరోసారి ఫొటోలు దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు ఇస్తామన్న కొత్త నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. మరొక వైపు రాష్ట్ర ప్రభుత్వం క్యూబిక్ మీటర్ల కొలతల పేరుతో చేసిన పనికి చట్ట ప్రకారం రూ.272 వేతనాలు చెల్లించకుండా కోత విధిస్తున్నదన్నారు. కూలీలకు ఇవ్వాల్సిన తట్ట, పార, గడ్డపార, కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లురివ్వడం లేదన్నారు. పని చూపని దగ్గర జాబ్ కార్డుదారులకు చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, జి నర్సింహ్మా, కె కాంతయ్య బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు, ఎస్ శివలింగం రాష్ట్ర కన్వీనర్ పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, కె మహాలక్ష్మి మహిళా రాష్ట్ర కన్వీనర్, పులి కల్పన డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఆరుణజ్యోతి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ రాంనాయక్, ఎస్ఎఫ్ఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డిబిఎస్ ఆనంద్, రైతు సంఘం సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు సరిచేయండి

- కెసిఆర్‌కు తమ్మినేని లేఖ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలను సరిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ఏడు వేల కేంద్రాలు తెరిచి కోటి టన్నుల యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. వరికోతలు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ లక్ష్యంలో 10 శాతం కూడా సేకరించలేదని వివరించారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడవటమే కాక నీటిలో కొట్టుకుపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు కొనుగోళ్లలో ఐకేపీ, సొసైటీ, మార్కెట్ కమిటీ, మిల్లర్లు మిలాఖతై తేమ, తాలు, తరుగు పేరుతో రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు. మార్కెట్లలో ధాన్యం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ మార్కెట్ నుంచి మిల్లుకు వెళ్లిన తర్వాత మిల్లర్లు ఐకేపీ ఏజెంట్లను పిలిచి, ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నదని క్వింటాలుకు నాలుగు కిలోల వరకు తగ్గించి ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతుకు చెల్లించాల్సిన డబ్బులో 10 శాతం కోత పెడుతున్నారని వివరించారు. అంతేకాకుండా తాలు, మట్టి ఉన్నాయనే పేరుతో కూడా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేండ్లుగా ఇలాంటి పద్ధతినే అనుసరించి ఏటా రూ.500 కోట్లు రైతులకు నష్టం కలిగించారని తెలిపారు. తిరిగి ఈ యాసంగిలో కూడా ఇదే తరహాలో మోసానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 'ఉప్పుడు బియ్యం'గా మార్చాలని సూచించారు. అందువల్ల తేమ ఒక యూనిట్ ఎక్కువ, తక్కువ ఉన్నా ప్రమాదం లేదని తెలిపారు. పైగా వాతావరణంలో 46 డిగ్రీల వేడి కొనసాగుతున్నదని వివరించారు. ఈ ఎండలో ధాన్యం ఒక గంట ఉన్నట్టయితే నిర్ణీత తేమ శాతం కన్నా తక్కువకు పడిపోతుందని పేర్కొన్నారు. అందువల్ల మిల్లర్లు విధిగా తేమ కలుపుతారని తెలిపారు. తద్వారా ఉప్పుడు బియ్యం క్వింటాలుకు 68 కిలోల దిగుబడి వస్తుందని వివరించారు. ఇది మిల్లర్లకు అదనపు లాభం అయినప్పటికీ రైతుల చెల్లింపుల్లో కోత విధించడంపై మార్కెట్లలో పెద్దఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాస్తారోకోలు, ధర్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విజిలెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మార్కెట్‌లో క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి ధాన్యం నాణ్యతా ప్రమాణాలను గుర్తించాలని కోరారు. రైతులకు జరుగుతున్న నష్టాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాకు మిస్డ్ కాల్స్ వస్తున్నాయి

తెలంగాణలో 43 నియోజకవర్గాల్లో వైఎస్ఆర్‌టిపి ప్రభావం : షర్మిల

- కెసిఆర్ వైఫల్యాలపై అఫిడవిట్ విడుదల
- డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలు దగ్గరపడుతుండడంతో అన్ని పార్టీల నుంచి మిస్డ్ కాల్స్ వస్తున్నాయి. ఏ కాల్ పిక్ చేసినా మీకే ముందు చెప్తా.. ప్రస్తుతం చార్జింగ్ మోడ్‌లో ఉన్నాం' అని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేయడం లేదని స్పష్టం చేశారు. విలీనం చేయడానికి పార్టీ పెట్టాల్సిన అవసరం లేదని, తాను వస్తానంటే ఏ పార్టీ కూడా వద్దని చెప్పదని, అలాంటప్పుడు పార్టీని విలీనం చేయాల్సిన అవసరంలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితే బాగోలేదని, 19 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. గెలిచిన ఎమ్మెల్యేలను నిలుపుకోలేని నాయకత్వం ఉన్న పార్టీలోకి ఎలా వెళ్తానని అన్నారు. పార్టీ నుంచి వెళ్లిన వాళ్లను తిరిగి తీసుకొచ్చే సత్తా ఆ పార్టీకి ఉందా? అని ప్రశ్నించారు.

ఇది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి చెందిన జాతీయ సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో 43 నియోజకవర్గాల్లో వైఎస్ఆర్‌టిపి ప్రభావం చూపిస్తోందని రిపోర్టులు వచ్చాయని తెలిపారు. 10-20 సీట్ల కోసం పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజా, నిరుద్యోగుల సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక పార్టీ తమదేనని, ఎవరి దగ్గర సీట్ల కోసం తగ్గాల్సిన అవసరం లేదని వివరించారు. బెంగళూరులో పిసిసి చీఫ్ డికె శివకుమార్‌తో భేటీపైనా స్పందించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలోనే డికె శివకుమార్ రాజకీయం చేశారని, కష్టపడి పార్టీని గెలిపించారని తెలిపారు. వైఎస్ఆర్ ఉన్నప్పటి నుంచి ఉన్న అనుబంధంతో కలిసి శుభాకాంక్షలు చెప్పినట్టు పేర్కొన్నారు.

బాండ్ పంపుతున్న సంతకం పెట్టు

ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ఇవ్వడంలో, టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ విషయంలో కేసీఆర్ వైఫల్యాలను గుర్తుచేస్తూ తయారుచేసిన అఫిడవిట్ (బాండ్ పేపరు)ను విడుదల చేశారు. ఆ డిక్లరేషన్‌పై సంతకం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు అఫిడవిట్‌ను మీడియా ముందు విడుదల చేశారు. పేపర్ లీకేజీ విషయంలో టిఎస్‌పిఎస్‌సి బోర్డును రద్దు చేసి పునర్నిర్మానం చేయలేదని చెప్పారు. పేపర్ లీకేజీకి ఐటీశాఖ మంత్రి కెటిఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి ప్రతిపక్షాలే కారణమని కేటీఆర్ చెబుతున్నారని, ఆ ప్రతిపక్షాలెవరో బయటి పెట్టాలని సూచించారు.

నారాయణ భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పుతున్న తమ్మినేని

నారాయణ మృతి సిపిఎంకి తీరని లోటు

- తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జుజ్జుల్‌రావు పేట గ్రామ సీనియర్ నాయకులు వెల్లంపల్లి నారాయణ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కల్లూరి గూడెం సొసైటీ మాజీ చైర్మెన్ వెల్లంపల్లి ఆశోక్ తండ్రి వెల్లంపల్లి నారాయణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తమ్మినేని వీరభద్రం మంగళవారం భైతికకాయంపు ఎర్రజెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తి నారాయణ అని గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో.. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, ఐద్వా రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మండల నాయకులు, గ్రామ కార్యదర్శి తాటి నర్సింహారావు, వార్డు మెంబర్ దాట్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నీటి విజయాలు ప్రపంచానికి పాఠాలు

ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ సదస్సులో ప్రసంగించనున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ వేదికపైన తెలంగాణ సాధించిన జలవిజయాన్ని చాటేందుకు మంత్రి కెటిఆర్ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మాణం, ఇంటింటికి సురక్షిత తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ ప్రాజెక్టుల నిర్మాణం, వాటి ఫలితాలను అమెరికాలోని నెవడా రాష్ట్రంలోని హెండర్సన్ నగరంలో జరుగుతున్న అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్-వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ కాంగ్రెస్ సదస్సులో ప్రారంభోపన్యాసం చేసేందుకు ఆ సంస్థ ఆహ్వానం మేరకు మంత్రి కెటిఆర్ అమెరికాకు వెళ్లారు.

సాగునీటి రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు, ప్రభుత్వ ప్రణాళికల గురించి 2017లో అమెరికా శాక్రమెంటో వేదికగా జరిగిన ఏఎస్‌సీఈ సదస్సులో మంత్రి కెటిఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భారీ సాగునీటి ప్రాజెక్టుల ప్రణాళికలు, అందరికి సురక్షిత తాగునీటినందించే మిషన్ భగీరథ లాంటి బృహత్ పథకాల గురించి ఆ రోజు కెటిఆర్ వివరించినప్పుడు ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఏఎస్‌సీఈ, ఆ తర్వాత 2022లో తెలంగాణలో పర్యటించింది. కాళేశ్వరం ప్రాజెక్టుని ప్రత్యేకంగా సందర్శించిన ఆ సంస్థ ప్రతినిధుల బృందం, తెలంగాణ సాగునీటి రంగంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఓ గేమ్ ఛేంజర్ అని ప్రశంసించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును స్వల్ప కాలంలోనే పూర్తి చేయడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసిన అమెరికన్ సివిల్ ఇంజనీర్స్ సొసైటీ ఆ విజయగాథను, తెలంగాణ ప్రభుత్వ ఘనతను అమెరికాలో వివరించేందుకు రావాలని ప్రత్యేకంగా కెటిఆర్‌కు ఆహ్వానం పంపించింది.

అమెరికాలోని అన్ని ప్రాంతాల నుంచి హాజరయ్యే సివిల్ ఇంజనీర్ల సమక్షంలో మంత్రి కెటిఆర్, సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు, దాని ద్వారా అందుతున్న ఫలాలు, ఇతర ప్రణాళికలను ఒక ప్రజెంటేషన్ రూపంలో అందించనున్నారు. కాళేశ్వరంతోపాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటిని అందించిన విధానం, ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన సామాజిక ఆర్థిక ప్రగతిని వివరించనున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఐదు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో పలు కంపెనీలతో మంత్రి సమావేశం కానున్నారు. ఈ నెల చివరి వారం వరకు కొనసాగే ఈ పర్యటనలో పలు అమెరికన్ కంపెనీలు తమ పెట్టుబడి ప్రకటనలను చేసే అవకాశం ఉన్నది.

భార్యను చంపి ఉరేసుకున్న భర్త

హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబంలో తరచూ గొడవల నేపథ్యంలో భార్యను చంపి అనంతరం భర్త ఉరేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో జరిగింది. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..

ఎల్లారెడ్డిగూడలో నివసిస్తున్న జనార్దన్ (40) కూలి పనులు చేసేవాడు. అతని భార్య ప్రేమలత (35) ప్రయివేటు ఉద్యోగి. 2004లో వీరికి వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు పిల్లలు. జనార్దన్ మద్యానికి బానిస కావడంతో దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. సోమవారం ప్రేమలత తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని తూంకుంటకు వెళ్లి రాత్రి తిరిగొచ్చారు. అనంతరం భార్యాభర్త గొడవపడ్డారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న జనార్దన్ ప్రేమలతను రాడ్డుతో కొట్టి చంపాడు. అనంతరం ఇంట్లోనే ఫ్యాన్‌కు అతను ఉరేసుకుని చనిపోయాడు. ఉదయాన్నే వారి కొడుకు గమనించి తన అమ్మమ్మ మంచు లక్ష్మికి ఫోన్ చేసి చెప్పాడు. వారు ఘటనాస్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

20న ఎన్‌టిఆర్ శత జయంతి సభ

ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవ సభ ఈనెల 20న హైదరాబాద్ కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా సావనీర్, వెబ్‌సైట్ ఆవిష్కరణ చేపడతారు.సభాఏర్పాట్లను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పరిశీలించారు. సభా వేదిక నిర్మాణం, సభా నిర్వహణ కమిటీల ఏర్పాటు, జన సమీకరణ, తదితర కార్యక్రమాలపై పార్టీ నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్ టి డి జనార్దన్‌రావు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నందమూరి రామకృష్ణ, జాతీయ అధికార ప్రతినిధి టి. జ్యోత్స్న, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి, ఐటిడిపి రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, టిడిపి మీడియా వ్యవహారాల కో ఆర్డినేటర్ బియ్యాని సురేష్, మీడియా కమిటి చైర్మెన్ ప్రకాష్‌రెడ్డి, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంటు పరిశీలకులు సుబాష్ యాదవ్, అశోక్ కుమార్ గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయి తులసి మున్సిపల్ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ప్రభుత్వోద్యోగి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తీవ్రమైన ఎండ.. వడగాడ్పు వల్ల వడదెబ్బకు గురైన ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందారు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంకు చెందిన ఎండీ.జానీబాబా(56) నల్లగొండలోని కమర్షియల్ టాక్స్ ఆఫీసులో డ్రైవర్ కం అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13న బజారుకు వెళ్ళొస్తానని ఇంటి నుంచి బయటికి వెళ్లిన జానీ బాబా తిరిగి రాలేదు. అదే రోజు వడదెబ్బకు గురై పాత సీతారాంపురం మధు బార్ వెనకాల పడిపోయాడు. అదే రోజు చనిపోగా, కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవడంతో పోలీసులు ఏరియాస్పత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు.

ఆశావర్కర్ల పరీక్షను రద్దు చేయాలి

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు ఆశా యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశావర్కర్లుగా సర్టిఫికెట్ పొందేందుకు ఉద్దేశించిన పరీక్షను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఇది వరకే ప్రభుత్వ శిక్షణ పొంది రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ జబ్బులను గుర్తిస్తూ మందులను సరఫరా చేస్తున్న ఆశావర్కర్లకు మళ్లీ పరీక్ష నిర్వహించాలనుకోవడం సరికాదని హితవు పలికింది. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు రెగ్యులర్‌గా సేవలందిండంతో పాటు కరోనా నియంత్రణలో కీలక పాత్ర పోషించి, ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్‌గా ప్రకటించిన ఆశాలకు పరీక్ష పెట్టడం సహేతుకంగా లేదని తెలిపింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయలక్ష్మి, ఆర్ నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి వినతిపత్రం అందజేశారు. పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చినట్టు ప్రతి నెల ఒకటి, రెండో తేదీల్లో చెల్లించాలనీ, పారితోషికం లేని పనులు చేయించకూడదనీ కోరారు. క్షయ, కుష్టు, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు చెల్లించాలనీ, జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలనీ, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలనీ, 32 రకాల రిజిస్టర్స్‌ను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వమే సరఫరా చేయాలనీ, నాణ్యతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫామ్స్ ఇవ్వాలనీ, జిల్లా ఆస్పత్రుల్లో రెస్ట్ రూం ఏర్పాటు చేయాలనీ, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలనీ, ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టిఆర్‌కు భారత రత్న ప్రకటించాలి

- ప్రముఖులు డిమాండ్

ప్రజాశక్తి- కల్చరల్

దేశ సినీ రంగంలో విభిన్న పౌరాణిక పాత్రలకు ప్రతిరూపంగా నిలిచిన ఏకైక నటుడు, సంచలన రాజకీయ నాయకుడు నందమూరి తారక రామారావు శత జయంతి సంవత్సరంలోనైన ఆయనకు కేంద్రం భారత రత్న ప్రకటించాలని ప్రముఖులు డిమాండ్ చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణలో ఎన్‌టిఆర్ శత జయంతి మహోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా సిబిఐ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ పాల్గొని మాట్లాడుతూ వెండి తెర వేల్పు ఎన్‌టిఆర్ ఆయన నటించిన పౌరాణిక పాత్రలు వేరే వారు ఎవ్వరూ చేయలేరని అన్నారు. ఎన్‌టిఆర్ ఆర్ పురస్కారాలు నటులు గుండు సుదర్శన్, భవానీ శంకర్, నాయకుడు కథానాయకుడు గ్రంథ రచయిత టి నవీన్‌కు బహుకరించారు. విఖ్యాత గాయని జిక్కి కుమార్తె హేమలతకు ఘంటసాల ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానం చేశారు. వంశీ రామ రాజు అధ్యక్షత వహించిన సభలో తెలుగు దేశం నాయకులు సాయి బాబా, బలరాజ్ గౌడ్, పి రవీంద్రా చారి కళా పోషకులు ఎంవి రావు, బద్రి నాథ్, ప్రతాప్ కుమార్ ఎం రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి సురేందర్ స్వాగతం పలికిన సభకు తొలుత బాపి రాజు బృందం సినీ గీతలు ఆలపించారు. సంస్థ అధ్యక్షులు పుష్పలత వందన సమర్పణ చేశారు.

మానవీయ విలువలు ప్రధానం

- అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి

ప్రజాశక్తి-కల్చరల్

భారతీయ తాత్వికత విశ్వమానవ శ్రేయస్సు అని మానవీయ విలువలు ప్రధానమని అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. అట్టి మానవీయ విలువలు చెప్పిన నవల ప్రేమ పవనాలు, మానవతా సౌరభాలు అని ఆమె అభినందించారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ న్యాయవాది, కవి గులాబీల మల్లారెడ్డి రచించిన ప్రేమ పవనాలు, మానవతా సౌరభాలు నవల ఆవిష్కరణసభ జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఆత్మీయ భావనల సంస్కృతిని అంతర్జాతీయ స్థాయిలో అద్దం పట్టిన నవలని పేర్కొన్నారు. సంపుటిని అవిష్కరించిన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపద విశ్వ శ్రేయస్సు అని మల్లారెడ్డి తన నవలలో ఆ అంశాన్నీ వివరించారని అన్నారు. అధ్యక్షత వహించిన కథకుడు సిఎస్ రాంబాబు డెబ్బై ఎనభై దశాబ్దిలలో కేంబ్రిడ్జి వంటి విశ్వవిద్యాలయయాలలో వివిధ దేశాల విద్యార్థుల మధ్య ఉన్న మానవ విలువలు ప్రేమ భావనలకు ప్రతీక గా నవల ఉందన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రతినిధి వడ్లూరి ఆంజనేయ రాజు స్వాగతం పలికారు.

వేడి గాలులతో జాగ్రత్త

- అనారోగ్య లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేడిగాలుల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. ఒకవేళ అనారోగ్యానికి గురైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'దాహం వేయకున్నా సరే...నీటిని ఎక్కువ మొత్తంలో తీసుకోవాలనీ, నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను, ఇంట్లో చేసుకున్న పండ్ల రసాలను తీసుకోవాలి. కాటన్ దుస్తులను ధరించాలి. తలను మూసుకునేలా గొడుగు తదితర వాటితో కప్పుకోవాలి. సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలనీ, ఉదయం, సాయంత్రం వేళల్లో బయటి పనులను పెట్టుకోవాలి. వాతావరణశాఖ ఎప్పటికప్పుడు చేసే హెచ్చరికలను పరిగణలోకి తీసుకుంటూ ఉండాలి... " అని తెలిపారు. "మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల మధ్య బయటికి పోకుండా ఉండాలనీ, బయటికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా చెప్పులు ధరించి వెళ్లాలనీ, వేడి బాగా ఉన్న సమయంలో వంట చేయొద్దనీ, కిచెన్‌లోకి గాలి వచ్చేలా తలుపులు, కిటికీలు తరచూ తెరిచి ఉంచాలనీ, ఆల్కహాల్, టీ, కాఫీతో పాటు కార్బోనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్, షుగర్ ఎక్కువగా ఉన్న పానీయాలు తీసుకోకూడదు. వీటితో శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది. హై ప్రొటీన్, తాజా ఆహారాన్నే తీసుకోవాలి. పార్కింగ్ చేసిన వాహనాల వద్ద పిల్లలను, పెంపుడు జంతువులను వెళ్లకుండా చూసుకోవాలి. " అని చెప్పారు. అనారోగ్యానికి గురైతే వెంటనే చికిత్స అందించేందుకు ప్రత్యేక బెడ్ల ఏర్పాటుతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్ ప్రభుత్వాస్పత్రుల్లో, ఓఆర్ఎస్ పాకెట్లను ఏఎన్ఎం, ఆశా, అంగన్ వాడీ వర్కర్ల వద్ద అందుబాటులో ఉంచినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం కాదు.. విప్లవం

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశ్వమానవుని విశ్వరూపాన్ని ఏర్పాటు చేసిన సిఎం కెసిఆర్ అన్ని వర్గాల ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ తెలిపారు. నూతనంగా నిర్మించిన తెలంగాణ సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు దేశంలోనే ఎక్కడ లేని విధంగా 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా ఇందిరాపార్కు వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధన్యవాద సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత పేరును సచివాలయానికి పెడితే ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అవాక్కులు చెవాక్కులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపి లు ఎందుకు సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టలేదో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడాలేని విధంగా దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించేలా సంక్షేమ పథకాలను రూపొందించినట్టు వివరించారు. ఒకప్పుడు కూలీలుగా ఉన్న దళితులు నేడు దళిత బంధు పుణ్యమా అని వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని యాజమానులుగా మారారని చెప్పారు. గత ప్రభుత్వాలు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దళితులపై నిర్లక్ష్య ధోరణి అవలంభించడం వల్లే నేటికీ వారి బతుకులు మారలేదన్నారు. దళితుల జీవన స్థితిగతులను మెరుగు పరిచేందుకు సిఎం కెసిఆర్ ఎంతగానో కృషి చేస్తున్నట్టు తెలిపారు.